సాక్షి పల్నాడు

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



శివాలయానికి రూ.5 లక్షల విరాళం

మంగళగిరి: మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్ఎన్ సీ ఫుడ్స్ ఎండీ సింగంశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ మన్నవ సందీప్‌లు రూ. ఐదు లక్షలు విరాళంగా అందజేశారు.



సబ్‌జైలు పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని తనిఖీ చేశారు.

రూ.4 లక్షలతో అలంకరణ

అద్దంకి రూరల్: అద్దంకిలోని వేయిస్తంభాల దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు రూ.4 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.



పోలీసులేని సమాజాన్ని ఊహించలేం



అమరులైన పోలీసు కుటుంబ సభ్యురాలికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అంబటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్

- డీఎస్‌ఏ స్టేడియంలో అమరవీరులకు నివాళులర్పించిన మంత్రి అంబటి ,ఎస్పీ రవిశంకర్
- అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేత

నరసరావుపేట: సమాజానికి పోలీసు వ్యవస్థ చేసే సేవలు అనీర్వచమైనవని, ఆ వ్యవస్థ లేని సమాజాన్ని మనం ఊహించలేమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి అంబటితోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ హాజరయ్యారు. జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు పర్యవేక్షణలో డీఎస్పీ చిన్నికృష్ణ సారథ్యంలో ఆర్ఐ వెంకటరమణ పరేడ్ కమాండర్‌గా స్మృతి పరేడ్ నిర్వహించి విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ అమరవీరుల స్థూపానికి ఘన నివాళులర్పించారు. మంత్రిమాట్లాడుతూ పోలీసు వ్యవస్థ లేకపోతే సమాజంలో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలకు అడ్డు ఉండదని అన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశంలో పోలీసులు నిత్యం పహారా కాస్తూ ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో ఎంతోమంది పోలీసులు అసువులు బాశారన్నారు. వారి ప్రాణత్యాగం వెలకట్టలేనిదన్నారు. సమాజ హితం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహావీరుల త్యాగాన్ని స్మరించుకోవడం మన కర్తవ్యమని, వారి స్ఫూర్తిని ముందుకు కొనసాగిస్తూ పోలీస్ శాఖ ప్రజలు, సమాజానికి మరిన్ని సేవలను అందించాలని సూచించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది దేశ వ్యాప్తంగా ఎంతో మంది సైనికులు, పోలీసులు సంఘవిద్రోహ శక్తులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 26 (వీరిలో 9 మంది పల్నాడు జిల్లా వారు) మంది పోలీసులు వీరమరణం పొందారన్నారు. వీరందరికీ మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని పేర్కొన్నారు. ఆ పోలీసుల కుటుంబ సభ్యులను ప్రతి ఏడాది పిలిచి వారిని సన్మానించుకుని, వారి సమస్యలను తెలుసుకొని తీర్చడానికి కృషిచేస్తున్నామన్నారు. అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో భవిష్యత్తులో సమాజం, ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సరిహద్దుల్లో సైనికులు, దేశంలో పోలీసుల నిరంతర శ్రమ, కృషి ఫలితంగానే ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని అన్నారు. సంఘవిద్రోహ శక్తులను అణచే క్రమంలో అసువులు బాసి వీరమరణం పొందుతున్నారన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. వారి ప్రాణత్యాగం వెలకట్టలేనిదని, వారి త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. జిల్లాలో వీర మరణం పొందిన పోలీసు కుటుంబ సభ్యులను సన్మానించి, వారికి పల్నాడు జిల్లా పోలీస్ శాఖ తరపున జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి.మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్‌ఏ స్టేడియంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి

ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఆరు కేసులు పరిష్కారం

నరసరావుపేటటౌన్: ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఆరు కేసులు పరిష్కారం కాగా రూ.37.30 లక్షలు కక్షిదారులకు పరిహారం కింద లభించిందని 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పీవీఎస్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శనివారం బాలచాముండేశ్వరి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో ఏడో రోజు లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పోస్టర్లు

సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పది రకాల పోస్టర్లను ఏర్పాటుచేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వినియోగదారుల హక్కుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలు, తూనికలు, కొలతల శాఖ అధికారులు, ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్నీ పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, గ్రామ, వార్డు సచివాలయాలు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, కన్జ్యూమర్ వలంటరీ ఆర్గనైజేషన్, మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తూనికలు, కొలతల శాఖ, కలెక్టర్ కార్యాలయాల్లో పది రకాల పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ,, మేనేజరు వరలక్ష్మి, తూనికల అధికారి అల్లూరయ్య, ఐసీడీఎస్ పీడీ బి.అరుణ, సోషల్ వెల్ఫేర్ అధికారి ఓబులు నాయుడు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- తగిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించండి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌


శనగ విత్తనాలను అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్‌ శ్యామ్‌ప్రసాదు, చైర్మన్‌ సాయి మార్కొండారెడ్డి

నరసరావుపేట: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వివిధ పంటలను సాగుచేస్తున్న రైతులకు ఆర్‌బీకేల ద్వారా తగిన అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాదు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్‌ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్‌ మాట్లాడుతూ మండలాల్లో అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు అందేలా చూడాలన్నారు. వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, కూరగాయల సాగుపై దృష్టిసారించేలా వారిని చైతన్యం చేయాలన్నారు. దీనివలన వారికి నికర ఆదాయం లభిస్తుందన్నారు. పశువుల మేత సరిపడా ఉండేలా చూసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో సాగునీరు అంతగా అవసరంలేని శనగపంటను పండించేందుకు వారికి అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేయాలన్నారు. చైర్మన్‌ మార్కొండారెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేలు, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పండించుకోవాల్సిన పంటలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, అధికారులు, సలహామండలి సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పంచదార స్టాకు పొజిషన్‌ వెంటనే తెలియజేయండి..

నరసరావుపేట: జిల్లాలో పంచదార స్టాకు పొజిషన్‌ తెలుసుకునేందుకు వెంటనే ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలను అప్‌డేట్‌ చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ ఏ.శ్యామ్‌ప్రసాదు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో చక్కెర వ్యాపారులు, హోల్‌సేల్‌, రిటైల్‌, బిగ్‌ చైన్‌ రిటైలర్‌, ప్రాసెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చక్కెర నిల్వుంచటం, నల్లబజారుకు తరలించటం నిరోధించేందుకు, వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ జీఓఐ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్‌.పద్మశ్రీ, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, అధికాలు, వ్యాపారులు పాల్గొన్నారు.

నా మాటలను వక్రీకరించి అబద్ధాలు వండివార్చారు

- వైఎస్సార్‌ సీపీ వారిని ఓటు వేయనీయక పోతే, నేను అడ్డుకుంటా అని మాత్రమే అన్నాను
- రిగ్గింగ్‌, దొంగ ఓట్ల సంస్కృతి టీడీపీదే..
- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


నరసరావుపేటలోని మీడియాతో మాట్లాడుతున్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: 'వైఎస్సార్‌ సీపీ వారు ఓట్లు వేయనీయకుండా టీడీపీ వారు అడ్డుకోవాలంటే నన్ను దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని' తాను అంటే దానికి విపరీతార్థాలు జోడించి, వక్రీకరించి టీడీపీ అనుకూల దినపత్రికలో రాయటం దారుణమని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఆ దినపత్రికలో(సాక్షి కాదు) తనపై వచ్చిన వార్తకు స్పందిస్తూ నరసరావుపేటలోని తన స్వగృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఆ పత్రికలో వచ్చిన వార్త దారుణమైందన్నారు. వడ్డెంగుంటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తాను వెళ్లానని, అక్కడ ఓ వ్యక్తి మీరెలా ఓట్లు వేసుకుంటారని ప్రశ్నించాడన్నారు. దీనిపై తాను మా పార్టీ వారు ఓట్లు వేయకుండా మీరు అడ్డగించాలనుకుంటే ఈ బ్రహ్మనాయుడును దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని తాను హెచ్చరించానన్నారు. అది సాధ్యంకాదని, ఎవరి ఓట్లు వారు వేసుకోవాలని సూచించానన్నారు. రుబాబు చేస్తానంటే కుదిరేపని కాదని చెప్పానన్నారు. తాను మాట్లాడిన మాటల్లో కొంతమేర కట్‌చేసి ఓట్లు మీరెలా వేస్తారో చూస్తానని తాను అన్నట్లుగా టీడీపీ అనుకూల పత్రికలో రాశారన్నారు. ప్రస్తుతం ఎవరు ఎవరిని బెదిరిస్తున్నారో, ఎవరు ఏవిధంగా మాట్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో లేని ఓట్లు ఉన్నట్లుగా టీడీపీ వారు రిగ్గింగ్‌ చేస్తున్నారన్నారు. రిగ్గింగ్‌, దొంగ ఓట్లు వేసే సంస్కృతి టీడీపీ వారిదని, దీనిని ఆపాలనేది తన అభిమతమన్నారు. వారు రిగ్గింగ్‌ చేస్తుంటే తాను చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. బెదిరించి ఓట్లు వేసేది టీడీపీ వారిదేనన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర లాంటి టీడీపీ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఈ నరేంద్ర, అతని కుటుంబ సభ్యులు రైతులు పెట్టుకున్న సంగం డెయిరీని పూర్తిగా లాగేసుకొని రూ.వందలకోట్లు దోపిడీ చేస్తున్నారన్నారు.

మార్కెట్లో దసరా ఆఫర్లు

- ఫర్నిచర్‌, ఆభరణాలు, వాహన కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్లు
- ఉచిత బహుమతులతో ఆకర్షిస్తున్న మొబైల్‌ షాపులు
- కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్న దుకాణాలు


గోల్డ్‌ షోరూంలో కొనుగోలుదారుల సందడి

నరసరావుపేట: దసరాకి షోరూం యాజమాన్యాలు కురిపిస్తున్న ఆఫర్లతో నరసరావుపేటతో పాటు జిల్లాలోని పట్టణాల్లో వస్త్ర దుకాణాలు, ఫర్నిచర్‌ షాపులు, మొబైల్‌ షాపులు, బ్రాండెడ్‌ షోరూంలు, నగల దుకాణాల్లో డిస్కౌంట్ల సందడి నెలకొంది. కార్లు, బైక్‌ ల షోరూంలో ఎక్చేంజ్‌ మేళాలు, ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, విలువైన ప్రత్యేక బహుమతులు, బంపర్‌ లక్కీడ్రాలు అందిస్తున్నాయి. వస్త్ర కొనుగోళ్లపై 20 నుంచి 50 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. ప్రధానంగా ద్విచక్రవాహన షోరూంలలో పాతవాటిని తీసుకొని కొత్త వాహనాలను అందించడమే కాకుండా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఫర్నిచర్‌ షాపుల్లో టేబుల్స్‌, బెడ్స్‌, సోఫాసెట్లు, గ్రైండర్లు, కుర్చీలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్‌ ఓవెన్‌తోపాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో 25 శాతంకు పైగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

మొబైల్‌ షాపుల్లో స్మార్ట్‌ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. హెడ్సెట్‌, బ్లూటూత్‌, హోం థియేటర్‌, పవర్‌ బ్యాంక్‌, బ్లూటూ అహెడ్సెట్‌ ఇలా ప్రతీ కొనుగోలుపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. దసరా పండగ వరకు కొనుగోలుదారుల్లో పండగ రోజు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి విలువైన వస్తువులను బహుమతిగా అందించనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ప్రత్యేక డిస్కౌంట్లు..

గోల్డ్‌ షోరూంలలో ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ షోరూం యాజమాన్యాలు అందిస్తున్న డిస్కౌంట్లతో కొనుగోళ్లు పెరిగాయని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

సచివాలయంలో ట్రైనీ కలెక్టర్‌ ఆకస్మిక తనిఖీ



నకరికల్లు: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్‌ కల్పశ్రీ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమపథకాలు, లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాలన చేస్తుందని అన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరుతో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన రీసర్వే గ్రామసభలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ కె.నగేష్‌, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మేడికొండ రామిరెడ్డి, సర్పంచి అరవా ఆదిలక్ష్మీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీర్ల అంకాలమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన పీఆర్కే దంపతులు


పట్టు వస్త్రాలు సమర్పించడానికి కుటుంబ సమేతంగా వస్తున్న ప్రభుత్వ విప్‌ రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పల్నాటి రణ క్షేత్రం కారెంపూడిలో కొలువు దీరిన పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లిని ప్రభుత్వ విప్‌, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) దంపతులు శుక్రవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ముఖద్వారం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలతో తరలివస్తున్న ప్రభుత్వ విప్‌ పీఆర్కేకు చిన్నారులు కోలాట ప్రదర్శన, స్థానిక ప్రజలు పూల వర్షంతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లికి ప్రభుత్వ విప్‌ పీఆర్కే ఆయన సతీమణి రమ, కుమారుడు గౌతమ్‌ రెడ్డి, డాక్టర్‌ గజ్జల సుధీర్‌ భార్గవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో పీఆర్కే దంపతులకు వేద పండితులు ఆశీర్వాదం అందించారు. అనంతరం అదే ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, గంగా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం షిరిడి సాయిబాబా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఆర్కే దంపతులను స్థానిక మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్నాటి చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో ప్రభుత్వ విప్‌ పీఆర్కేకు స్వాగతం పలికారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం చెన్నకేశవుని, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పీఆర్కే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఆర్యవైశ్య సంఘ పెద్దలు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. పక్కనే ఉన్న నగరేశ్వరస్వామికి కూడా పీఆర్కే దంపతులు అభిషేక పూజలు చేశారు. అనంతరం గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యే పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు షేక్‌ షఫీ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, చెన్నకేశవస్వామి ట్రస్టు బోర్డు చైర్మన్‌ చల్లా వీర్లవరప్రసాదరావు, వాసవి అమ్మవారి దేవాలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు, సర్పంచ్‌ రమావతు ప్రమీలాభాయితేజానాయక్‌, ఎంపీటీసీ సభ్యులు బొమ్మిన సావిత్రి, అంతరగడ్డ ఏసోబు, షేక్‌ ఆరీఫ్‌, వేముల పద్మలింగయ్య పాల్గొన్నారు.

తిమ్మాపురం హైవేపై ప్రమాదం

- వలస కార్మికుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుడు పాడేరు వాసి

యడ్లపాడు: తిమ్మాపురం హైవేను దాటుతున్న ఇద్దరు కార్మికులను బైక్‌ ఢీకొంది. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు రోడ్డుపై పడిన ఒకరిపై దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన సత్యజిత్‌ సాహు, తూర్పుగోదావరి జిల్లా పాడేరుకు చెందిన నూకరాజు ఇద్దరు తిమ్మాపురంలోని మంజునాథ(24) నూలుమిల్లులో పనిచేసే వలస కార్మికులు. శుక్రవారం తమ వ్యక్తిగత పనులను చూసుకుని గ్రామంలోని 16వ నంబర్‌ హైవేను దాటుతున్నారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి రాజమండ్రికి రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌పై వెళ్తున్న వెంకట సూర్య బైక్‌ వీరిని ఢీకొంది. కార్మికులతో పాటు బైక్‌పై ఉన్న వెంకట సూర్య కూడా హైవేపై పడిపోయాడు. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. సరిగ్గా అప్పుడే ఆ మార్గాన వేగంగా దూసుకువచ్చిన కారు నూకరాజుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భవనం టెక్స్‌టైల్స్‌ సమీపంలో నెలకొన్న ఈ ఘటన సమాచారం స్థానికుల ద్వారా అందుకున్న 108 వాహన సిబ్బంది ఈఎన్‌టీ శోభన్‌ బాబు, పైలెట్‌ శివనాగాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. మృతదేహాన్ని పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కోతలపై తప్పుడు రాతలు

విద్యుత్‌శాఖ ఈఈ ఎస్‌.శ్రీనివాసరావు

నకరికల్లు: ప్రభుత్వంపై, విద్యుత్‌శాఖ పనితీరుపై బురదజల్లడానికి తప్పు విద్యుత్‌కోతలు అన్న వార్తల్లో వాస్తవం లేదని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్‌.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని శివాపురంతండాలో లక్‌పతినాయక్‌ అనే రైతు పొలం వ్యవసాయ విద్యుత్‌కోతల వల్లే ఎండిపోయిందని కరెంటు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఓ దినపత్రిక(సాక్షి కాదు)లో వచ్చిన కథనం మేరకు శనివారం శివాపురంతండాకు వెళ్లి పొలాలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెల్లవారుఝామున 3గంటల నుంచి పగలు 12గంటల వరకు ఒకవారం, ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఒకవారం విద్యుత్‌ను రోజుకు 9గంటల చొప్పున సరఫరా చేస్తున్నామని అన్నారు. రైతు పొలం ఎండిపోవడానికి కారణం విద్యుత్‌ కోతల వల్ల కాదని, రైతు పొలంలో బోరు నుంచి నీరు 5–10 నిమిషాలకు మించి రాకపోవడంతో నీరుచాలక పొలం ఎండిందని స్పష్టం చేశారు. ఇదే విషయం శివాపురంతండాకు వెళ్లి అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి అసలు విషయం రాబట్టామని అన్నారు. బోరు పని చేయని రైతు పొలం ఒక ఎకరం మినహా ఆగ్రామంలోని అన్నిపొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయని, ఇదే విషయం అక్కడి రైతులే స్పష్టం చేశారని అన్నారు. తప్పుడు కథనాలతో బురదజల్లడం తగదన్నారు.